క్లుప్తంగా

నేడు ఓటరు జాబితా ప్రదర్శన

ఆమనగల్లు: మండల పరిధి 13 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు ఎంపీడీఓ కుసుమ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం 19వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, తుది ఓటరు జాబితాను 28న విడుదల చేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు.. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

తలకొండపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యులు చెప్పారు. గురువారం మండల పరిధి జూలపల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో హైదరాబాద్ కామినేని ఆస్పత్రి, ఆమన్‌గల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 190 మందికి పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలివేలమ్మ, విజయ్‌రెడ్డి, గోవర్ధన్, తిరుపతి, శివ, సురేష్, సాయి, లాస్కర్, అశోక్, రవి, శ్రీనివాస్, యాదయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ చైర్మన్ నర్సింహ, సభ్యులు

మంచాల: మండల పరిధి ఆరుట్ల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ చైర్మన్ నర్సింహ మాట్లాడుతూ.. చిన్నారులకు ఎల్లప్పుడూ తమ వంతు సహకారం ఉంటుందన్నారు. విద్య, ఆటల్లో ప్రతిభ చూపిన వారికి తగిన ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు. 317 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమేష్, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, సభ్యులు కేపీ రమేష్‌రాజు, జిల్లామోని రవి, అశోక్, భీంరావు, బాలరాజు, మల్లేశ్, వెంకటేశ్, ఉపాధ్యాయులు కల్యాణ్, బాబు, సరిత, శేఖర్, యాదగిరి, రాజవర్ధన్ రెడ్డి, పారిజాత, స్వప్న, పద్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణరేఖకు డాక్టరేట్ ప్రదానం

ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ విభాగంలో పరిశోధన



స్వర్ణరేఖ

ఇబ్రహీంపట్నం రూరల్: వడ్డెమోని స్వర్ణరేఖకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామానికి చెందిన మోహన్‌దాస్ మాలతిల కుమార్తె స్వర్ణరేఖ.. చిన్ననాటి నుంచి చదువుల్లో మేటి. ఇంటర్, ఇంజినీరింగ్, పీజీ అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ చేసింది. పెరుగుతున్న విద్యుత్ వాహనాల వినియోగం వలన విద్యుత్ సరఫరాలో ఒత్తిడి తగ్గింపుపై ప్రొఫెసర్ విద్యాసాగర్ పర్యవేక్షణలో.. ఆమె చేసిన పరిశోధనలకు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా స్వర్ణరేఖ మాట్లాడుతూ.. తనకు సహకరించిన యూజీసీ డీన్ సీనియర్ అధ్యాపకుడు గడ్డం మల్లేషం, స్కాలర్ మస్కు రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పట్నం ప్రజలు స్వర్ణకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆమనగల్లు: కోలాటం ఆడుతున్న భక్తులు



కడ్తాల్: గణేశ్ నిమజ్జన ఊరేగింపులో పోతరాజులు

ఘనంగా గణనాథుడికి పూజలు

పలుచోట్ల గంగమ్మ ఒడికి చేరిన గణపతి

చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు గణపయ్యకు ఘనంగా పూజలు చేస్తున్నారు. ఆరో రోజైన గురువారం.. ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల తదితర ప్రాంతాల మండపాల్లో కొలువై ఉన్న గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు అన్నదానం చేశారు. కడ్తాల్ మండలం, ఆమనగల్లు పరిధిలో నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లంబోదరుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. అనంతరం దప్పుచప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలు, భక్తుల నృత్యాల నడుమ ఊరేగింపుగా శివపుత్రుడిని చెరువులో నిమజ్జనం చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నంలో.. భక్తుల పూజలు



ఆమనగల్లులో వినాయకుడి నిమజ్జనం



కడ్తాల్: మైసిగండిలో..



మాడ్గుల: కోల్కులపల్లిలో..



ఆమనగల్లు: సంకటోనిపల్లిలో లంబోదరుడి పూజలో కౌన్సిలర్ రాధమ్మ తదితరులు



ఇబ్రహీంపట్నం: మున్నూరు కాపు బస్తీలో..



కడ్తాల్: హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో..



ఆమనగల్లులో గణనాథుల ఊరేగింపు

విద్యతోనే ప్రగతి సాధ్యం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మాడ్గుల: విద్యతోనే ప్రగతి సాధ్యమని పల్లెటి ఫౌండేషన్ సభ్యుడు రాంరెడ్డి అన్నారు. మండలంలోని ఇర్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను, స్కాలర్‌షిప్‌కు ఎంపిక కైన వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఫౌండేషన్ సభ్యులు నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లపై చర్చిస్తున్న డీసీపీ సునీతా రెడ్డి

తుర్కయంజాల్: గణేశ్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఆమె తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వద్ద గణపతి నిమజ్జనాలను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డిలకు పలు సూచనలు చేశారు.

మత్స్యకారులకు జీవనోపాధి

తలకొండపల్లి: చెరువులు అలుగు పారుతుండటంతో మత్స్యకారులకు జీవనోపాధి లభించిందని ఆ సంఘం గ్రామ అధ్యక్షుడు నూకం శేఖర్ అన్నారు. మండల పరిధి పడకల్ అప్పన్న చెరువు వద్ద గురువారం వృత్తి దారులు గంగమ్మ(దేవత) తల్లికి పూజలు చేశారు. రాములు, శేఖర్, అంజయ్య, యాదయ్య, కుమార్, శివానంద్ ఉన్నారు.



అప్పన్న చెరువుకు పూజలు చేస్తున్న మత్స్యకారులు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి
- ఘనంగా పోషణ మాస వారోత్సవాలు

కడ్తాల్: పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. మండల పరిధి రావిచేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్బోహైడ్రెట్లు, ప్రొటీన్లు, ఫైబర్‌ల మిశ్రమాలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వెల్లడించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం తప్పనిసరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లలిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సజాత, వాణిశ్రీ, సువర్ణ, ఆశ కార్యకర్తలు జాహేద, మంజుల, అనిత పాల్గొన్నారు.

కర్కల్‌పహాడ్‌లో..

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత నిర్మూలన, పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన సలహాలు ఇచ్చారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: సమతుల్యమైన పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండల పరిధి రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం గురించి మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారం అందిస్తేనే సరైన ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్ పద్మ, లక్ష్మి, ఉపాధ్యాయురాలు సరస్వతి, మహిళలు పాల్గొన్నారు.



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి



తలకొండపల్లి: రాంపూర్‌లో..

ఆటపాటలతో చదువు

ఆమనగల్లు: మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత కోరారు. పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించడంతో పాటు.. ఆటపాటలతో చదువు చెబుతామని చెప్పారు. పట్టణంలోని 5,6 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం లభించే కూరగాయలు, ఆకు కూరలను ప్రదర్శించారు. అనంతరం ఆమె వాటి గురించి వివరించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోరబాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు పోషకాహారంతోనే ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్య, విమల, ఆయా నురున్నిసా తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారం గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత

క్రీడాకారులను ప్రోత్సహించాలి

- సీఐ ప్రమోద్‌కుమార్
- ముగిసిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆ ప్రోత్సాహంతో వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలుగుతారని చెప్పారు. రెండు రోజులుగా పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు గురువారంతో ముగిసాయి. పీడీ జ్యోతి, బాలికల ఉన్నత పాఠశాల పీడీ రిజ్వాన, వివేకా విద్యాభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ మహమూద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు సీఐ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. పోటీలతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగున్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. ఏటా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను సీఐ కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్‌నాయక్, ఎస్‌ఐ వెంకటేశ్, ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ తదితరులు

డ్వాక్రా సంఘంలో అవకతవకలు

- తీర్మానం లేకుండా నిధుల స్వాహా
- డీఆర్‌డీఓకు సంఘం సభ్యుల ఫిర్యాదు

యాచారం: మండల పరిధి మల్కీజ్‌గూడ డ్వాక్రా సంఘంలో అవకతవకలు జరిగాయని శ్రీవల్లి డ్వాక్రా సంఘం సభ్యులు ఆరోపించారు. విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఆర్‌డీఓ శ్రీలతకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎలాంటి తీర్మానం లేకుండానే సంఘం నిధులను కొందరు సభ్యులు బ్యాంకు నుంచి డ్రా చేశారని పేర్కొన్నారు. నిధుల గోల్‌మాల్‌పై ఎంపీడీఓ, ఏపీఎం, సీసీలకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. విచారణ జరిపి బాధ్యులైన వారిపై, వారికి సహకరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు కోరారు.



డీఆర్‌డీఓకు ఫిర్యాదు అందజేస్తున్న సంఘం సభ్యులు

బీజేపీ సభ్యత్వ నమోదు విస్తృతం చేయాలి

మంచాల: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని కార్యక్రమ ఇన్‌చార్జి మర్పల్లి అంజయ్య యాదవ్ సూచించారు. గురువారం మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ నిర్మాణంలో సభ్యత్వ నమోదు ప్రధాన అంశం అని, పార్టీ పిలుపు మేరకు కమలనాథులు ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నూకం రాజు, బండి రాజు, పాండు, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ ఎంఈఓగా బాసు

కడ్తాల్: మండల విద్యాధికారిగా బాసును నియమిస్తూ జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో ఎంఈఓగా పనిచేస్తున్న బాసును ఇక్కడికి బదిలీ చేశారు. ఇన్‌చార్జి ఎంఈఓగా పనిచేస్తున్న సర్దార్ సింగ్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించడంతో మండలంలో విద్యా వ్యవస్థ గాడిన పడనుందని, విద్యార్థుల సమస్యలు తీరనున్నాయని ప్రాంత ప్రజలు భావిస్తున్నారు.

సీతారాం మృతి తీరని లోటు

- దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన సీపీఎం నాయకులు
- ఏచూరి చిత్రపటాలకు నేతల నివాళి
- మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో గళం విప్పిన నాయకుడు
- కొనియాడిన పార్టీ శ్రేణులు

తుర్కయంజాల్: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ అధ్యక్షతన తుర్కయంజాల్ అంబేద్కర్ కూడలిలో గురువారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే సీపీఎం విధానాలకు ఆకర్షితులైన ఏచూరి.. అంచెలంచెలుగా జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. మతతత్వం, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తన గళం వినిపించిన నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, కమిటీ జిల్లా సభ్యుడు జగన్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శులు శంకర్, ప్రకాష్ కారత్, నాయకులు సత్యనారయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందిన సీతారాం ఏచూరికి సీపీఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని రాజీవ్‌చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు వెంకటయ్య, ప్రజాసంఘాల నాయకులు రమేశ్, శంకర్, రఘురాములు, బాలస్వామి, రాములు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల సంక్షేమానికి..

ఇబ్రహీంపట్నం: సీతారాం ఏచూరి(72) మరణంపై ఆ పార్టీ ఇబ్రహీంపట్నం నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్, మండల నాయకులు బుగ్గ రాములు, జంగయ్య, జగన్‌లు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేసిన యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఏచూరి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు.



ఆమనగల్లు: సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నం: ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



తుర్కయంజాల్: ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు